సాక్షి సంగారెడ్డి

ఆదివారం । 26 । మార్చి । 2023



వంద శాతం లక్ష్యం సాధించేనా?

హుస్నాబాద్ మున్సిపల్ పరిధిలో వంద శాతం ఇంటి పన్ను లక్ష్యంగా మున్సిపల్ అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. 8లో




తహసీల్దార్ కార్యాలయంలో కలకలం

భూమిని తన పేరిట పట్టా చేయాలని ఓ యువకుడు తహసీల్దార్ కార్యాలయంలో ఆత్మహత్యాయత్నం చేశాడు. 8లో



గుంతలే.. గుంతలు

బొల్లారం మున్సిపాలిటీలోసమస్యలు తీరడం లేదు. బస్‌స్టేషన్ నుంచి పాత మున్సిపల్ కార్యాలయం వరకు, అక్కడి నుంచి ఇండస్ట్రీకి వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారయ్యాయి. 9లో



అమ్మో చిరుత!

ఏడాదిన్నరగా గ్రామాల్లో అలజడి

- పశువులపై దాడి.. లేగదూడలు, మేకలు హతం



డబుల్‌బెడ్‌రూం ఇళ్ల వద్ద చిరుత పాద ముద్రలు(ఫైల్)



చిరుత దాడిలో మృతిచెందిన గొర్రెలు (ఫైల్)

నారాయణఖేడ్: నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో చిరుత పులి సంచారం భయాందోళనకు గురి చేస్తోంది. ఏడాదిన్నరగా తరచూ మూగజీవాలపై దాడులకు తెగబడుతోంది. ఇప్పటివరకు పదుల సంఖ్యలో మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. ఎప్పుడు ఎటు నుంచి దాడి చేస్తుందోనని రైతులు వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లేందుకు జంకుతున్నారు. ఒంటరిగా చేలల్లో ఉండేందుకు భయపడుతున్నారు.

- ఇటీవల నారాయణఖేడ్ మండలంలోని సంజీవన్‌రావుపేట్ గ్రామంలో చిరుత మూగజీవాలపై దాడి చేసి చంపి తినేసింది. వ్యవసాయ క్షేత్రాలకు ఆనుకొని అటవీ ప్రాంతాలు ఉండటంతో ఎక్కడినుంచి చిరుత దాడికి తెగబడుతుందోనని ఆందోళనకు గురవుతున్నారు. అటవీశాఖ అధికారులు చిరుతను బంధించేందుకు చర్యలు చేపట్టకపోవడంతో ఆగ్రహానికి గురవుతున్నారు.
- ఏడాదిన్నర క్రితం నారాయణఖేడ్ మండలం జూకల్ శివారులో డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణ కూలీలను చిరుత వెంబడించింది. కూలీలు రాత్రి సమయంలో బహిర్భూమికి వెళ్లగా దూరం నుంచి గమనించిన చిరుత కూలీలను వెంబడించింది. దీంతో కూలీలు పరుగెత్తుకెళ్లి డబుల్ బెడ్రూం మూడో అంతస్తుకు వెళ్లారు. అయినా విడవని చిరుత మూడో అంతస్తు వరకు వెంబడించగా ఎలాగోలా కూలీలు స్లాబ్‌పైకి ఎక్కి చిరుత దాడి నుంచి బయటపడ్డారు. ఈ ఘటన అప్పట్లో చర్చనీయాంశంగా మారింది. పులి అడుగులను నిర్మాణ ప్రాంతంలో అటవీశాఖ అధికారులు గుర్తించారు.

శివారు గ్రామాల్లో భయం భయం

- కల్హేర్, సిర్గాపూర్, నారాయణఖేడ్ మండల సరిహద్దుగా ఉన్న పలు గ్రామాల్లో అటవీప్రాంతం విస్తరించి ఉంది. అటవీ ప్రాంతం నుంచి దగ్గరి చేలల్లో చిరుత సంచరిస్తోంది. రాత్రి సమయాల్లో దీని సంచారం ఎక్కువగా ఉంటోంది. ఆయా గ్రామాల్లో ఇప్పటివరకు పదుల సంఖ్యలో లేగదూడలను హతమార్చింది.
- సంజీవన్‌రావుపేట్ గ్రామంలో ఉమ్మాయి బుచ్చయ్య, అవుటి మొగులయ్య, పోశెట్టి, విఠల్, భూపాల్‌లకు చెందిన దూడలను హతమార్చి తినేసింది. వ్యవసాయ క్షేత్రాల్లో, గ్రామ శివార్లలోని పాకల్లో కట్టేసి ఉంచిన వీటిని రాత్రి సమయంలో దాడిచేసి చిరుత చంపేసింది.
- కల్హేర్ మండలం బల్కంచెల్క తండాలో మూడ్ దశరథ్‌కు చెందిన 25 గొర్రెల మందపై దాడిచేసి హతమార్చింది. కద్పల్, నాగ్‌ధర్ గ్రామాల్లో రెండు చొప్పున దూడలను చంపేసింది. ర్యాకల్, రాపర్తి గ్రామాల శివార్లలోనూ లేగదూడలను చంపేసింది. ఇలా సంజీవన్‌రావుపేట్, నాగ్‌ధర్, కృష్ణాపూర్, ఖాజాపూర్, అలికాన్‌పల్లి, బాచేపల్లి, సిర్గాపూర్, కద్పల్, ర్యాకల్, రాపర్తి తదితర గ్రామాల శివార్లలో చిరుత సంచారం ఆందోళనకు గురి చేస్తోంది. అటవీ ప్రాంతం నుంచి వస్తున్న చిరుత ఏ గ్రామ శివారులోకి వెళ్లి దాడి చేస్తుందోనని రైతులు, గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి అయ్యిందంటే భయటకు రావడం లేదు.

దూడలను చంపేసింది



సంజీవన్‌రావుపేట్ గ్రామ శివారులో ముగ్గురు రైతులకు చెందిన దూడలను చిరుత దాడిచేసి చంపేసింది. మా గ్రామ పరిసరాల్లో చిరుత సంచరిస్తుండటంతో భయాందోళనకు గురవుతున్నాం. ఎప్పుడు ఎక్కడినుంచి దాడి చేస్తుందోనని పొలాల వద్దకు ఒంటరిగా వెళ్లలేకపోతున్నాం.

– బుజ్జం కిషన్, సంజీవన్‌రావుపేట్

భయంగా ఉంది



చిరుత సంచారంతో రాత్రి వేళ పొలాల వద్దకు వెళ్లేందుకు భయంగా ఉంది. ఇప్పటికే పలుమార్లు గ్రామ శివారులో చిరుత దాడులు ఎక్కువయ్యాయి. దూడలను చంపి తినేసింది. అటవీశాఖ అధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలి.

– లక్ష్మణ్ సాగర్, సంజీవన్‌రావుపేట్

చాటింపు వేయించాం



చిరుత సంచారం ఉన్న అటవీ సరిహద్దు గ్రామాల్లో చాటింపు వేయించాం. జనాలు జాగ్రత్తగా ఉండాలని సూచించాం. ఇప్పటివరకు చిరుత దాడిలో చనిపోయిన ఐదు పశువులకు సంబంధించి పరిహారం మంజూరు అయ్యింది. రైతులు తమ పశువులను కొట్టాల్లో గడియ వేసి జాగ్రత్తగా ఉంచుకోవాలి.

– కె.చంద్రశేఖర్, ఫారెస్ట్ రేంజ్ అధికారి, నారాయణఖేడ్

పోషణ్ పక్వాడాపై అవగాహన అవసరం

- కలెక్టర్ శరత్



మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: పోషణ్ అభియాన్‌లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిరు ధాన్యాల ప్రాముఖ్యంపై అవగాహన కల్పించాలని కలెక్టర్ డాక్టర్ శరత్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో పోషణ్ పక్వాడా వారోత్సవాలపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిరుధాన్యాల ప్రాముఖ్యత గురించి తెలియజేసేలా ప్రదర్శనలు చేపట్టాలన్నారు. రోజువారీగా చేస్తున్న కార్యక్రమాలను జన్ ఆందోళన్ డ్యాష్ బోర్డులో ఫొటోలు అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ గాయత్రీ దేవి, మహిళా శిశు సంక్షేమ అధికారి పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

‘లోక కల్యాణం.. పచ్చ తోరణం’

సంగారెడ్డి టౌన్: లోక కల్యాణం పచ్చ తోరణం అనే కార్యక్రమానికి ఆర్టీసీ గతేడాది శ్రీకారం చుట్టిందని ఆర్టీసీ మెదక్ రీజియన్ మేనేజర్ ఎస్.సుదర్శన్ పేర్కొన్నారు. ఎక్కువమంది భక్తులు ఆర్టీసీ ద్వారా భద్రాచల రాముల వారి తలంబ్రాలను బుక్ చేసుకోవడంలో మెదక్ రీజియన్ రాష్ట్రంలో తృతీయ స్థానంలో నిలిచిందని తెలిపారు. ఈ సంవత్సరం కూడా ఈ సేవలు అందుబాటులో ఉన్నాయని, భక్తులు రూ.116 చెల్లిస్తే సీతారామ స్వామి కల్యాణ తలంబ్రాలను ఇంటి వద్దే అందజేస్తామన్నారు. మెదక్, నారాయణఖేడ్, సంగారెడ్డి, జహీరాబాద్, సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్ డిపోలలో మార్కెట్ ఎగ్జిక్యూటివ్‌లను సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

న్యూస్‌రీల్

ఇద్దరికి పాజిటివ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం 22 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా అందులో ఇద్దరికి పాజిటివ్ వచ్చినట్లు టెస్టుల నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు 17 మందికి చేసినట్లు పేర్కొన్నారు.

ఇఫ్తార్ విందు ఏర్పాట్ల పరిశీలన



సూచనలు చేస్తున్న ఆర్డీఓ

నారాయణఖేడ్: రంజాన్ ఉపవాస దీక్షలను పురస్కరించుకొని ప్రభుత్వం తరపున ఖేడ్ పట్టణంలోని రహమాన్ ఫంక్షన్ హాలులో ఈనెల 27న సాయంత్రం 5 గంటలకు ముస్లింలకు ఇఫ్తార్‌విందును ఏర్పాటు చేస్తున్నారు. ఈ విందుకు ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖమంత్రి హరీశ్ రావు హాజరు కానున్నారు. శనివారం ఖేడ్ ఆర్డీఓ అంబదాస్ రాజేశ్వర్, మున్సిపల్ చైర్ పర్సన్ రుబీనా నజీబ్ ఫంక్షన్‌హాల్‌లో విందుకు సంబంధించి చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఏర్పాట్లకు సంబంధించి పలు సూచనలు, సలహాలనిచ్చారు.

చిట్కుల్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న దృశ్యం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామంలోని 266, 267, 305, 309 సర్వే నంబర్లలో గల దేవుని మాన్యంలో అక్రమంగా నిర్మించిన ఇళ్లను రెవెన్యూ అధికారులు పోలీసుల బందోబస్తు మధ్య కూల్చివేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పరమేశం మాట్లాడుతూ.. ఇళ్లలో నివసిస్తున్న వారిని బయటికి పంపించి ఐదు ఇళ్లను పూర్తిగా, మూడు ఇళ్లను పాక్షికంగా కూల్చివేశారు. ఎటువంటి ఆందోళనకు తావివ్వకుండా పెద్దఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే దేవుని మాన్యంలోకి వచ్చిన ప్రహరీని కూడా వదిలిపెట్టకుండా అధికారులు కూల్చివేశారు. దేవుని మాన్యాన్ని స్వాధీనం చేసుకొని పరిరక్షిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

మొండి బకాయిలు వసూలు చేస్తున్నాం



ఓ పరిశ్రమ ప్రతినిధితో పన్నులు చెల్లించాలని సూచిస్తున్న కమిషనర్, ఆర్వో తదితరులు

జిన్నారం(పటాన్‌చెరు): పరిశ్రమల యాజమాన్యాలు పన్నులు చెల్లించడం లేదని, మొండి బకాయిలను వసూలు చేసేందుకు ప్రత్యేక డ్రైవ్‌ను ఏర్పాటు చేస్తున్నామని బొల్లారం మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్ తెలిపారు. జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలోని 12 పరిశ్రమలు ఏళ్లుగా పన్నులు చెల్లించటం లేదు. దీంతో శనివారం మున్సిపల్ అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. గణేశ్ ఎంటర్‌ప్రైజెస్ పరిశ్రమ నుంచి రూ.8.27 లక్షల పన్ను వసూలు చేశారు. ఈ సందర్భంగా రాజేంద్రకుమార్ మాట్లాడతూ పన్నులు చెల్లించని పరిశ్రమలకు రెడ్ నోటీసులు అందించామన్నారు. గృహ, వాణిజ్య సముదాయ, పరిశ్రమల యజమానులు ఐదు రోజుల్లో పన్నులను చెల్లించాలని సూచించారు. అనంతరం మున్సిపల్ పరిధిలోని కుడికుంట రహదారి పక్కన అక్రమంగా ఏర్పాటు చేసిన ఓ కమర్షియల్ కంటెయినర్‌ను మున్సిపల్ అధికారులు, సిబ్బంది జేసీబీతో తొలగించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఆర్వో శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

మునిపల్లి పీహెచ్‌సీకి ‘ఎన్‌క్వాస్’



సెంట్రల్ వైద్య బృందంతో మునిపల్లి పీహెచ్‌సీ వైద్య బృందం (ఫైల్)

మునిపల్లి(అందోల్): ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న మునిపల్లి పీహెచ్‌సీకి కేంద్ర ప్రభుత్వం ఎన్‌క్వాస్ గుర్తింపునిచ్చింది. ప్రతి ఏడాది కాయకల్ప, జాతీయ నాణ్యత ప్రమాణాల(ఎన్‌క్వాస్) పేరిట పలు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. 2023 జనవరి 6, 7 తేదీల్లో మునిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కేంద్ర వైద్య బృందం (సెంట్రల్ టీం) పరిశీలించింది. ఆస్పత్రి పరిసరాలు, స్వచ్ఛత, మెడిసిన్ స్టోర్ రూం, ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేసినందుకు మునిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఈ నెల 24వ తేదీన ఎన్‌క్వాస్‌కు ఎంపిక చేశారు.

- మూడు సంవత్సరాల వరకు ఎన్‌క్వాస్ గుర్తింపు పొందిన ఆస్పత్రులకు ప్రతి ఏడాది రూ.3 లక్షల చొప్పున నిధులు రానున్నాయి. వీటితో ఆస్పత్రి ఆధ్వర్యంలో 14 రకాల కార్యక్రమాలు చేపడతారు. నేషనల్ కంట్రోల్ ప్రోగ్రాం, టీబీ, మలేరియా, ఇమ్యునైజేషన్, విద్యార్థులకు చికిత్సలు (హెల్త్), మెడిసిన్ స్టోర్ రూం నిర్వహణ, ల్యాబ్, లేబర్ రూం, రికార్డు, శానిటేషన్, గర్భిణులకు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత భోజనం, అంబులెన్స్‌లో ఇంటి నుంచి తీసుకురావడం, తిరిగి ఇంటికి చేర్చడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు.

సంతోషంగా ఉంది



మునిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఎన్‌క్వాస్ గుర్తింపు రావడం సంతోషం. గర్భిణులకు, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. మెరుగైన చికిత్స అందిస్తున్న వైద్య బృందానికి ప్రభుత్వం అవార్డు, సర్టిఫికెట్ అందజేస్తుంది.

– డాక్టర్ సంధ్య, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మునిపల్లి

‘చలో ఢిల్లీని జయప్రదం చేయండి’

రేగోడ్(మెదక్): ఏప్రిల్ 5వ తేదీన తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి శోభన్, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు ఎండీ. సర్దార్ పిలుపునిచ్చారు. శనివారం వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులకు కనీస వేతనాలు పెంచడం లేదన్నారు. రోజురోజుకు నిత్యావసరాల ధరలు పెరుగుతున్నాయని వాపోయారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బసవరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశం, సీఐటీయూ మండల నాయకులు ఏసయ్య, అమృత్, సాయిలు, గ్రామపంచాయతీ కార్మికుల సల్మాన్, ఉషయ్య, నర్సయ్య, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంస్థలను అమ్మడమే అభివృద్ధా?



జన చైతన్య యాత్రకు సంఘీభావం ప్రకటిస్తున్న నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): ప్రభుత్వ రంగాలను అమ్మి కార్పొరేట్ శక్తులకు దోచి పెట్టడమే దేశ అభివృద్ధా అని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వెంకట్ ప్రశ్నించారు? ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ సీపీఎం చేపట్టిన జన చైతన్య యాత్ర శనివారం సాయంత్రం సంగారెడ్డికి చేరుకుంది. ఈ సందర్భంగా పాత బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన సభలో వెంకట్ మాట్లాడుతూ గ్రామాల్లో పేదలకు పని లేకుండా చేయాలనే కుట్రతో కేంద్ర బడ్జెట్లో ఉపాధి హామీకి నిధులు కోత పెట్టారని ఆరోపించారు. తొమ్మిదేళ్ల పాలనలో ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని, ప్రశాంతమైన తెలంగాణను నాశనం చేయడానికి బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు. కార్యక్రమంలో జాన్‌వెస్లీ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్క రాములు, సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు, బీఆర్ఎస్ నాయకులు వీర మల్లేశం, రాజయ్య, మాణిక్యం, సాయిలు, పట్నం మాణిక్యం, బీరయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమం కేపీఎస్‌బీకేఎస్‌తోనే సాధ్యం

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, చిత్రంలో ఎమ్మెల్యే జగ్గారెడ్డి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): కార్మికుల సంక్షేమం కార్మిక పోరాట సమితి బహుజన కార్మిక సంఘం కూటమితోనే సాధ్యమని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని మద్దికుంట శివారులోని ఎంఆర్ఎఫ్ పరిశ్రమ యూనియన్ ఎన్నికల్లో భాగంగా శనివారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. యూనియన్ ఎన్నికల్లో కార్మికులు ఐక్యంగా ఉండి పులి గుర్తుకు ఓటేసి కొత్తగొల్ల శేఖర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. రూ.75 వేల వేతన ఒప్పందాన్ని, ప్రస్తుతం వస్తున్న గ్రాట్యుటీకి అదనంగా రూ.2 లక్షలు సాధించుకుందామన్నారు. అనంతరం ఎమ్మెల్యే జగ్గారెడ్డి మాట్లాడుతూ.. కార్మికులకు ప్రతి నిత్యం అందుబాటులో ఉండే శేఖర్‌కు కార్మికులు మద్దతుగా నిలిచి ఎన్నికల్లో గెలిపించుకోవాలని సూచించారు. కార్మికులకు ఏ సమస్య వచ్చినా అండగా ఉండి యాజమాన్యంతో కొట్లాడి సమస్యలను పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ నాయకుడు ప్రభాకరన్, బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, నాయకులు ధన్‌రాజ్, దస్తూరి విఠల్ తదితరులు పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

సదాశివపేట(సంగారెడ్డి): టీజేఎస్ జిల్లా కన్వీనర్ కొత్తగొల్ల సత్తయ్యయాదవ్‌తో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎస్. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీలపై ప్రభుత్వం సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. గంటల తరబడి మాట్లాడే సీఎం కేసీఆర్ ఎక్కడ ఉన్నడో తెలియడం లేదని ఆరోపించారు. నిందితులను రక్షించడానికి సీఎం ప్రయత్నించడం సిగ్గుచేటన్నారు. టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష పడేవరకు పోరాడుతామని స్పష్టం చేశారు.

శ్రమకు తగిన గుర్తింపు

నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి



సర్పంచ్‌లకు అవార్డు అందించి సత్కరిస్తున్న ఎమ్మెల్యే మదన్ రెడ్డి

హత్నూర(సంగారెడ్డి): పరిశుభ్యంపై ప్రత్యేక దృష్టి సారించినందుకు గాను సర్పంచ్‌లకు జాతీయ అవార్డులు రావడం సంతోషకరమని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. శనివారం హత్నూర రైతు వేదికలో జాతీయ పంచాయతీ అవార్డులను ఎమ్మెల్యే సర్పంచ్‌లకు అందజేసి శాలువా కప్పి సన్మానించారు. మండల కేంద్రమైన హత్నూర, చిక్ మద్దూర్, మధుర, మల్కాపూర్, దౌల్తాబాద్, నాగారం, కోనంపేట్, కొత్తగూడెం, పల్పనూరు, తురకల ఖానాపూర్, నవపేట్ గ్రామాలకు దీన్ దయాల్ ఉపాధ్యాయ పంచాయతీ సతత్ వికాస పురస్కారం రావడంతో శ్రమకు తగ్గ ఫలితం దక్కిందని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేసినప్పుడు ప్రభుత్వం నుంచి గుర్తింపు వస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వావిలాల నర్సింలు, జెడ్పీటీసీ ఆంజనేయులు, పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి, ఎంపీడీఓ శారదాదేవి, ఎంపీఈఓ సువర్ణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, సర్పంచ్‌లు వీరస్వామి గౌడ్, మల్లేశం, మాధవి నవీన్‌గౌడ్, వెంకటేశం, ఎంపీటీసీలు విఠల్‌రెడ్డి, కిషన్ రావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వం మంజూరు చేసిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

కాగడాలతో యువజన కాంగ్రెస్ నేతల నిరసన



జహీరాబాద్‌లో కాగడాలతో నిరసన తెలుపుతున్న యువజన కాంగ్రెస్ నాయకులు

జహీరాబాద్: రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేయడాన్ని నిరసిస్తూ జహీరాబాద్‌లో యువజన కాంగ్రెస్ నేతలు కాగడాల ప్రదర్శన నిర్వహించారు. శనివారం రాత్రి జహీరాబాద్ పట్టణంలో యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు నరేష్‌గౌడ్ ఆధ్వర్యంలో కాగడాలను ప్రదర్శిస్తూ ర్యాలీ చేపట్టారు. 65వ జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. బీజేపీ చేస్తున్న కుట్రలపై కాంగ్రెస్ పార్టీ న్యాయ పోరాటం చేస్తుందన్నారు. దేశంలో మోదీ ప్రభుత్వం అణచివేత మార్గాన్ని ఎంచుకుందని విమర్శించారు. కార్యక్రమంలో రాష్ట్రకార్యదర్శి రాకేష్ శెట్కార్, జిల్లాఅధ్యక్షుడు ఉదయ్ శంకర్ పాటిల్, నాయకులు నరేష్‌గౌడ్, రాజు బానోతు, మల్లికార్జున్, అక్షయ్ జాడె, జహీర్, నరేష్, బబ్లూ, నరేష్‌కుమార్, రాజ్‌కుమార్, తిరుపతిరెడ్డి, రాజేష్, ఫక్రుద్దీన్, నిజాం, సొహైయిల్, అశోక్, ఇమ్రా, శరణ్, భరత్, రవి, ఉమాకాంత్, ఖాదర్, షకీబ్ పాల్గొన్నారు.

‘సస్పెండ్ చేయాలి’



డీఈఓ రాజేశ్ దిష్టిబొమ్మతో నిరసన వ్యక్తం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): ఏబీవీపీ ఆధ్వర్యంలో శనివారం సంగారెడ్డిలోని ఐబీ వద్ద అవినీతికి పాల్పడి ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన జిల్లా విద్యాధికారి రాజేశ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్య సమితి సభ్యుడు చంద్రశేఖర్, జిల్లా కన్వీనర్ ఆకాష్ మాట్లాడుతూ జిల్లా విద్యాధికారి నాంపల్లి రాజేశ్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆయన పనిచేసిన ప్రతి చోట అవినీతికి పాల్పడుతున్నప్పటికీ జిల్లాలో పోస్టింగ్ ఇవ్వడంలో ఆయనకు సహకరించిన వారిని కూడా విచారించాలన్నారు. గతంలో పుల్‌కల్ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా సమస్యను పరిష్కరించలేదన్నారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న వేళ ఫలితాలపై ఎలాంటి ప్రభావం పడకుండా వెంటనే కొత్తగా జిల్లా విద్యాధికారిని నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి శ్రీకాంత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పూజ, శశాంక్, దినేశ్, వెంకట్ రెడ్డి, తానాజీ, నిఖిల్, గిరి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

డీఈఓ అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు



డీఈఓ రాజేశ్, సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణను కోర్టుకు తరలిస్తున్న ఏసీబీ అధికారులు

కొండాపూర్(సంగారెడ్డి): జిల్లా విద్యాధికారి కార్యాలయంలో శనివారం కూడా ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. శుక్రవారం మధ్యాహ్నం ప్రారంభమైన ఏసీబీ సోదాలు సుమారు 24 గంటల పాటు కొనసాగాయి. గతంలో నిజామాబాద్‌లో పనిచేసిన సమయంలో చేసిన కార్యకలాపాలు, జిల్లాకు వచ్చిన తర్వాత ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల నుంచి ఏ కోణంలో డబ్బులను తీసుకుంటున్నారు? ఏవిధంగా అవినీతికి పాల్పడుతున్నారనే విషయాలపై డీఈఓను విచారించినట్లు అధికారులు తెలిపారు. సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ కేవలం డీఈఓ ఒత్తిడితోనే ప్రైవేట్ పాఠశాలల నుంచి డబ్బులు డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. శుక్రవారం మధ్యాహ్నం నుంచి డీఈఓ కార్యాలయంలోని ఉద్యోగులందరూ రాత్రి అంతా అక్కడే ఉన్నారు. నెల రోజులుగా డీఈఓ కార్యాలయానికి పర్మిషన్ కోసం ఎవరెవరు వచ్చారు? వారి నుంచి ఏమైనా డబ్బులు డిమాండ్ చేశారా? అనే కోణంలో విచారించినట్లు సమాచారం. ప్రధానంగా డీఈఓ కార్యాలయ కింది స్థాయి ఉద్యోగి నుంచి ఏడీ స్థాయి ఉద్యోగి అందరినీ ప్రశ్నించారు. డీఈఓ ఇంతకుముందు కూడా ఎవరినైనా డబ్బులు డిమాండ్ చేశాడా? ఎవరైనా ఆఫీసులో డబ్బులు ఇచ్చారా? డీఈఓ కార్యాలయంలో ఆయన డబ్బులు తీసుకునేందుకు ఎవరెవరు సహకరిస్తారు అనే కోణంలో విచారించినట్లు తెలుస్తోంది. ఈ సోదాల్లో ఎక్కడా కూడా ఎలాంటి ఆధారాలు లభించలేదని ఏసీబీ వర్గాలు తెలిపాయి. శనివారం మధ్యాహ్నం 2 గంటలకు జిల్లా విద్యాధికారి రాజేశ్‌తో పాటు సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు ఏసీబీ డీఎస్పీ ఆనంద్ తెలిపారు. 200 పేజీలకు పైగా చార్జిషీట్ ఫైల్ చేసి కోర్టుకు సమర్పించనున్నట్లు సమాచారం. డీఈఓతో పాటు రామకృష్ణకు వైద్య పరీక్షలు చేసి ఏసీబీ కోర్టుకు తరలిస్తామని చెప్పారు. అవినీతి నిరోధక శాఖ అధికారులకు డీఈఓ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడటంతో కార్యాలయ ఉద్యోగులు టెన్షన్ టెన్షన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందో, ఎవరు ఎవరి పేరు చెప్తారో తెలియక ఉద్యోగులంతా తీవ్ర ఆందోళనకు గురైనట్లు తెలుస్తోంది.

క్లుప్తంగా

వాహనదారుడికి జరిమానా



రశీదు అందజేస్తున్న హరితహారం అధికారి ఐలయ్య

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): హరితహారం చెట్టు కొమ్మ విరగడానికి కారణమైన వాహనదారుడికి హరితహారం అధికారి ఐలయ్యా జరిమానా విధించారు. ఈఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట పట్టణంలోని కరీంనగర్ రోడ్డులోగల హరితహారంలో పెంచిన లెగుస్టోమియా చెట్టును మహారాష్ట్రకు చెందిన డీసీఎం వ్యాన్ డ్రైవర్ విక్రమ్ వ్యాన్‌తో ఢీకొట్టడంతో చెట్టు కొమ్మ విరిగింది. ఈ విషయాన్ని స్థానికులు హరితహారం అధికారికి సమాచారం ఇచ్చాడు. వెంటనే ఆయన అక్కడకు చేరుకుని వాహనదారుడికి రూ.3 వేల జరిమానా విధించారు.

బండరాళ్లు విరిగి మీదపడి డ్రైవర్ మృతి



మాజిద్ (ఫైల్)

కోహీర్(జహీరాబాద్): బండరాళ్లు జారి మీదపడటంతో జేసీబీ డ్రైవర్ మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. ఎస్‌ఐ సురేశ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జహీరాబాద్ మండలం శేఖాపూర్‌కు చెందిన మృతుడు మహమ్మద్ మాజిద్(19) జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం గుట్ట తవ్వుతుండగా బండరాళ్లు జారి మీదపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే చికిత్స నిమిత్తం జహీరాబాద్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. అజాగ్రత్తగా జేసీబీని నడపడం వల్లే ప్రమాదం జరిగిందని మృతుడి తండ్రి మహబూబ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

సిద్దిపేట అర్బన్: మద్యం మత్తులో మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తి పురుగుల మందు తాగాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన శనివారం సిద్దిపేట అర్బన్ మండలం తడ్కపల్లి గ్రామంలో జరిగింది. సిద్దిపేట త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తడ్కపల్లికి చెందిన శివకుమార్ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. 6 నెలలుగా మద్యానికి బానిసై మతిస్థిమితం కోల్పోయాడు. గురువారం ఉదయం 7 గంటలకు ఇంట్లో పురుగుల మందు తాగి పడిపోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో గాంధీ ఆస్పత్రికి తీసుకువెళ్లాలని వైద్యులు సూచించడంతో అక్కడికి తరలించారు. ఆక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య బండి పద్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కక్షపూరిత వైఖరి సరికాదు

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రమేశ్

చిన్నకోడూరు(సిద్దిపేట): రాహుల్ గాంధీపై కేంద్ర ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రమేష్, మండల అధ్యక్షుడు మిట్టపల్లి గణేష్ ఆరోపించారు. కాంగ్రెస్ నేత ఎంపీ రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయడాన్ని నిరసిస్తూ శనివారం చిన్నకోడూరులో ప్రధాని మోదీ చిత్రపటం దగ్ధం చేశారు. ప్రశ్నించే గొంతులను కేంద్ర ప్రభుత్వం నొక్కి వేస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు జంగిటి శ్రీనివాస్, కనకరాజు, అజ్జు యాదవ్, చిరంజీవి తదితరులు ఉన్నారు.

వంద శాతం లక్ష్యం సాధించేనా?

హుస్నాబాద్: మున్సిపల్ పరిధిలో 2022–23 ఆర్థిక సంవత్సరం తుది గడువు లోపు వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేసేందుకు అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. వంద శాతం పూర్తి చేయాలనే లక్ష్యంతో పన్నుల వసూళ్ల వేట ప్రారంభించారు. మున్సిపల్ నిర్వహణ, సిబ్బంది వేతనాలు, ఇతర అవసరాలకు అన్ని జనరల్ ఫండ్ నుంచే ఖర్చు చేయాల్సి ఉంటుంది. సిబ్బంది వేతనాల కోసం ప్రభుత్వం నుంచి చిల్లిగవ్వరాదు. ఆదాయం పెద్ద మొత్తంలో ఉన్నా ఖర్చు కూడా అంతే మోతాదులో ఉంటుంది. నిర్వహణకు కావల్సిన ప్రతీపైసా జనరల్ ఫండ్ నుంచే ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ నెల రోజులు కలెక్షన్‌పైనే దృష్టి పెట్టారు.

- హుస్నాబాద్ పట్టణంలో మొత్తం 6949 ఇళ్లు ఉన్నాయి. ఇందులో రెసిడెన్షియల్ 5874, నాన్ రెసిడెన్సియల్ 516, మిక్స్‌డ్ 559 ఉన్నాయి. వీటితో పాటుగా ట్రేడ్ లైసెన్స్‌లు ఉన్న వ్యాపార, వాణిజ్య దుకాణాలు, స్మార్ట్ ఇండస్ట్రీస్‌తో పాటు ఆయిల్ మిల్లులు, రైస్ మిల్లులు, ఇతర కమర్షియల్ పరిధిలోకి వచ్చే షాపుల నుంచి పన్నులు వసూలు చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు.
- మున్సిపల్ సిబ్బంది మొత్తం ఐదు బృందాలుగా విడిపోయి కలెక్షన్‌పై దృష్టి సారించారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా వంద శాతం పన్నులు చేయాలని లక్ష్యంతో ప్రతీషాపు, ఇంటికి తిరుగుతూ పన్నులు వసూలు చేస్తున్నారు. వార్డుల వారీగా బిల్ కలెక్టర్లకు టార్గెట్ విధిస్తున్నారు. ఇంటి తలుపు తెరువగానే బిల్ కలెక్టర్లు, సిబ్బంది ప్రత్యక్షమై పన్నులు వసూలు చేసే పనిలో పడ్డారు.
- గతంలో పన్నులు చెల్లించేవారికి మాన్యువల్ రశీదులు ఇచ్చేవారు. దీంతో రశీదులు ఇచ్చినప్పటికీ పన్నుల జాబితాలో మాత్రం జమ చేయకుండా సిబ్బంది అక్రమాలకు పాల్పడిన సంఘటనలు ఉన్నాయి. ప్రస్తుతం ప్రతీ సేవా పన్ను చెల్లింపులను ఆన్‌లైన్ ద్వారా అనుసంధానం చేస్తున్నారు.
- గత సంవత్సరం 2021–22 ఆర్థిక సంవత్సరంలో రూ.కోటి 6 లక్షల 33 వేలు టార్గెట్ ఉండగా, 98.03 శాతంతో రూ.కోటి 4 లక్షల 24 వేలు వసూలు చేశారు. 2022–23లో రూ.కోటి లక్ష 94 వేలు డిమాండ్ ఉండగా, ప్రస్తుతం రూ.81.48 లక్షలు వసూలు చేసి 79.93 శాతం పన్నులు వసూలు చేశారు. ఈ నెల 31వ తేదీలోగా వంద శాతం పన్నులు వసూలు చేయాలని పరిమితి విధించడంతో అధికార, సిబ్బంది మొత్తం పన్నుల వసూళ్లలో నిమగ్నమయ్యారు. + ఇప్పటికే వంద శాతం పన్నులు వసూలు చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో ఈనెల రోజులు పన్నుల వసూళ్లపైనే శ్రద్ధ వహిస్తున్నారు. ఆదాయానికి అనుగుణంగా ఖర్చులు ఉండటం, జనరల్ ఫండ్ ద్వారానే మున్సిపల్ నిర్వాహణ, సిబ్బంది వేతనాలు చెల్లిస్తుండటంతో అధికారులు పన్నుల వసూళ్లను ప్రత్యేక టార్గెట్‌గా దృష్టి కేంద్రీకరించారు. ఇప్పటికే హుస్నాబాద్ పట్టణంలో మరుగుదొడ్ల నిర్మాణంలో వంద శాతం పూర్తి చేసి ఓడీఎఫ్ ప్రకటించగా, పన్నుల వసూళ్లలో వంద శాతం పూర్తిచేసే దిశవైపు అడుగులు వేస్తున్నారు.



హుస్నాబాద్‌లో ఓ సినిమా థియేటర్ యజమానికి రశీదు అందజేస్తున్న అధికారులు

ప్రజలు సహకరించాలి



మున్సిపాలిటి పరిధిలోని ప్రజలు ఇంటి, నల్లా పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలి. ట్రేడ్ లైసెన్స్‌లు పొందిన దుకాణదారులు సకాలంలో లైసెన్స్ ఫీజులు చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి దోహదపడాలి. ప్రజలు చెల్లించిన పన్నుల ద్వారనే మున్సిపాలిటీ నిర్వాహణ, ప్రజలకు ఉపయోగపడే వసతుల కల్పనకు అవకాశం ఉంటుంది. ప్రజల సహకారంతో ఇప్పటి వరకు దాదాపు 79.93 శాతం పన్నుల వసూలు చేశాం. ఈ నెల చివరి తేదీలోగా పూర్తి స్థాయిలో పన్నులు వసూలు చేసి వంద శాతం లక్ష్యానికి చేరుకుంటాం.

– సుంకె రాజమల్లయ్య, మున్సిపల్ కమిషనర్, హుస్నాబాద్

ఆగని సైబర్ మోసాలు

- ప్రైవేటు సంస్థ పేరిట ఫేక్ కాల్
- లోన్ మంజూరైందని బురిడీ
- రూ.1,07,062 పంపి మోసపోయిన బాధితుడు

సిద్దిపేట కమాన్: సైబర్ మోసాలపై పోలీసు అధికారులు అవగాహన కల్పిస్తున్నప్పటికీ అత్యాశతో అపరిచితులు చేసే ఫోన్ కాల్స్‌కు స్పందించి డబ్బులు పోగొట్టుకుంటున్న బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. శనివారం సీఐ రవికుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట పట్టణానికి చెందిన ఓ వ్యక్తికి దని సంస్థ పర్సనల్ ఎగ్జిక్యూటీవ్‌ను మాట్లాడుతున్నానంటూ ఫోన్ చేసి పరిచయం చేసుకున్నాడు. మీకు రూ.5 లక్షల లోన్ మంజూరైందని నమ్మించాడు. లోన్ డబ్బులు ఖాతాలో జమ చేయాలంటే ప్రాసెసింగ్ చార్జీలు చెల్లించాలన్నాడు. దీంతో బాధితుడు గూగుల్ పే, ఫోన్ పే ద్వారా పలుదఫాలు రూ.1,07,062 పంపాడు. తర్వాత ఆ నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో మోసపోయినట్లు గ్రహించి వెంటనే జాతీయ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు తెలిపారు.

ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయండి

గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్

గజ్వేల్‌రూరల్: నిరుద్యోగుల కోసం దీక్ష పేరుతో డ్రామా చేస్తున్న బీజేపీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే మోదీ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి దేశంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నింటినీ భర్తీ చేయించాలని గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం గజ్వేల్ పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్‌లో బీఆర్ఎస్ పార్టీ గజ్వేల్, కొండపాక మండలాల అధ్యక్షులు బెండ మధు, నూనె కుమార్‌యాదవ్‌తో కలిసి మాట్లాడారు. మోదీ ప్రభుత్వంపై మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన వెంటనే కోటి ఉద్యోగాలను భర్తీ చేస్తామని యువతను మోసంచేసి ఓట్లు వేయించుకొని, ఇప్పుడు కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా ప్రభుత్వ రంగ సంస్థలను ఒక్కొక్కటిగా అమ్ముతున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో దేశంలో నిరుద్యోగం పెరిగిపోతుందన్నారు. దేశ రక్షణలో అత్యంత ప్రతిష్టాత్మకమైన సైనిక నియామకాల్లో కాంట్రాక్టు పద్ధతిని ప్రవేశపెట్టిన చరిత్ర మోదీ ప్రభుత్వానిదేనన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలతో దేశం తిరోగమన స్థితికి చేరుకుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రమేశ్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి, శివకుమార్, భాస్కర్, స్వామి, కిష్టారెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్

కేంద్ర ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తాం

హత్నూర(సంగారెడ్డి): కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు సీపీఐ(ఎం) జనచైతన్య బస్సు యాత్ర చేపట్టామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, రాష్ట్ర నాయకుడు చుక్క రాములు అన్నారు . శనివారం సాయంత్రం హత్నూర మండలం దౌల్తాబాద్ అంబేడ్కర్ చౌరస్తాకు బస్సు చేరుకోవడంతో ఆ పార్టీ సంగారెడ్డి జిల్లా నాయకులు స్వాగతం పలికారు. అంబేడ్కర్ విగ్రహానికి బృందం సభ్యులు పూలమాలలు నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడారు. మార్చి 24వ తేదీన నిజామాబాద్ యాత్ర ప్రారంభమైందని, ఈ యాత్ర నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి జిల్లాకు చేరుకుందన్నారు. వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల్, వనపర్తి, నాగర్ కర్నూల్, హైదరాబాద్ జిల్లాల గుండా ప్రయాణించి మార్చి 29వ తేదీన హైదరాబాద్‌లో ముగుస్తుందన్నారు. ముగింపు సభకు సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు ప్రకాశ్ కారత్ హాజరవుతున్నారని తెలిపారు. దళితులు, గిరిజనులు, మైనార్టీలు, మహిళల మీద దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ అధికారంలో ఉంటూనే ప్రజాస్వామ్యం, లౌకికత్వం, సామాజిక న్యాయం, ఫెడరలిజంపై దాడి చేస్తోందని విమర్శించారు. రాజ్యాంగ స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. లౌకికత్వం, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకునేందుకు ప్రజలు ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అధ్యక్షుడు నర్సింలు, జెడ్పీటీసీ ఆంజనేయులు, ఎంపీటీసీ విఠల్ రెడ్డి బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, సీపీఎం జిల్లా నాయకులు మాణిక్యం, సాయిలు, జిల్లా మండల నాయకులు రమ, వెంకటరావు, రవి, కృష్ణ, మైపాల్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



జనచైతన్య యాత్రకు స్వాగతం పలుకుతున్న నాయకులు

వాహనం ఢీకొని నెమలి మృతి



నెమలి కళేబరం

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని తోటపల్లి శివారులోని రాజీవ్ రహదారి పైన గుర్తు తెలియని వాహనం ఢీకొని జాతీయ పక్షి నెమలి మృతి చెందింది. వీఆర్ఏ రామస్వామి ఇచ్చిన సమాచారం మేరకు అటవీ శాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి వచ్చి పరిశలించారు. నెమలి కళేబరాన్ని పశు వైద్యశాలకు తీసుకెళ్లి పోస్టుమార్టం నిర్వహించారు. వాహనం ఢీకొనడంతో బలమైన గాయాలయి మృతి చెందినట్లు పశువైద్యాధికారి హరిత తెలిపారు.

వడగళ్ల వానకు దెబ్బతిన్న వరి పంటలు



కొండపాకకు వెళ్లే దారిలో కూలిన చెట్టు

కొండపాక(గజ్వేల్): కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లో శనివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన అకాల వడగళ్ల వానకు వరి పంటలు దెబ్బతిన్నాయి. మండల పరిధిలోని జప్తినాచారం, బందారం, బొబ్బాయిపల్లి, మర్పడ్గ, కొండపాక, సిర్సనగండ్ల , బొబ్బాయిపల్లి, మేదినీపూర్, కుకునూరుపల్లి గ్రామాల్లో సుమారు పది నిమిషాల పాటు వడగళ్లు పడ్డాయని రైతులు తెలిపారు. జప్తినాచారం, మర్పడ్గ గ్రామాల శివారు పొలాల్లో విద్యుత్తు స్తంబాలు పడిపోయాయి. రాజీవ్ రహదారి నుంచి కొండపాక గ్రామానికి వెళ్లే దారిలో చెట్టు కూలి రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టం వివరాలను సేకరించి పరిహారం అందేలా చూడాలని అన్నదాతలు కోరుతున్నారు.

మహనీయుల జయంతి వేడుకలను జయప్రదం చేయాలి

ఉత్సవ కమిటీల నియామకం

బెజ్జంకి(సిద్దిపేట): ఏప్రిల్‌లో జరగబోయే మహనీయుల జయంతిని విజయవంతం చేయాలని ఆలిండియా అంబేడ్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు బొగిరి శ్రీనివాస్, మాల మహానాడు రాష్ట్ర నాయకుడు ఎలుక దేవయ్య పిలుపు ఇచ్చారు. బెజ్జంకి రైతు వేదికలో శనివారం మహనీయుల జయంతి కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారు మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవ నిర్వహణ కమిటీ చైర్మన్‌గా ఐలేని శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్‌గా లింగాల శ్రీనివాస్, సలహాదారులుగా కల్లూరి రవి, రొడ్డ మల్లేశం, మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి కమిటీ చైర్మన్‌గా పెద్దోల్ల శ్రీనివాస్, వైస్ చైర్మన్‌గా అక్కరవేని పోచయ్య, సలహాదారులుగా బొనగిరి గంగారాం, లింగాల మల్లయ్య, బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి కమిటీ చైర్మన్‌గా శానగొండ శరత్, వైస్ చైర్మన్‌గా కోంపెల్లి రాజు, సలహాదారులుగా చింతకింది పర్శరాములు, తాడిచెటి భూమయ్యలతో పాటు జయంతుల నిర్వాహణ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రూపేశ్, అంబేడ్కర్ సంఘం మండల అధ్యక్షుడు దీటి బాలనర్సు, మాల మహానాడు మండల అధ్యక్షుడు సంగెం రూపేశ్ తదితరులు పాల్గొన్నారు.



బెజ్జంకిలో మహనీయుల జయంతుల కమిటీ సమావేశ దృశ్యం

ప్రజాదర్బార్‌లో నాగుపాము

నంగునూరు(సిద్దిపేట): ప్రజాదర్బార్ నిర్వహిస్తున్న ప్రాంతానికి నాగుపాము రావడంతో కలకలం రేగింది. అక్కడే ఉన్న పంచాయతీ కార్యదర్శి దాన్ని పట్టుకొని అడవిలో విడిచిపెట్టడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటన శనివారం నంగునూరులో చోటు చేసుకుంది. ఉపాధిహామీ పథకంలో నిర్వహించిన పనులపై శనివారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నారు. సమీపంలో నాగుపాము ఉందని తిమ్మాయిపల్లి పంచాయతీ కార్యదర్శి గౌస్ చెప్పి ఎంపీడీఓ కార్యాలయంలోకి వెళ్లాడు. గౌస్‌ను చూసిన పాము బుసలు కొట్టడం ఆపడంతో దానిని పట్టుకొని అడవిలో విడిచి పెట్టాడు. ఇన్నాళ్లు సామాజిక తనిఖీ సిబ్బంది పనిచేస్తున్న ప్రాంతం నుంచి పాము బయటకు రావడంతో సిబ్బంది భయాందోళకు గురయ్యారు.



నాగుపామును పట్టుకుంటున్న కార్యదర్శి గౌస్

ఎర్ర జెండాతోనే పేదలకు న్యాయం

హుస్నాబాద్‌రూరల్: గ్రామీణ పేదలకు ఎర్ర జెండాతోనే న్యాయం జరుగుతుందని గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర కార్యదర్శి గన్నెబోయిన వెంకటాద్రి అన్నారు. హుస్నాబాద్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న గ్రామీణ పేదల సంఘం 6వ రాష్ట్ర మహాసభలో శనివారం మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ధరణి సాకుతో అర్హులకు పట్టాలు ఇవ్వకుండా వేధిస్తున్నారని ఆరోపించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడిగా పడిగ ఎర్రయ్య, కార్యదర్శిగా గన్నెబోయిన వెంకటాద్రి, సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు నేనవత్ రాందాస్, జిల్లా కమిటీ సభ్యులు చెన్నబోయిన వెంకటాద్రి, గన్నెబోయిన రాజేశం, వరంగల్ జిల్లా అధ్యక్షుడు మొగిలిచెర్ల వీరస్వామి, ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతినిధుల సభకు హాజరైన నాయకులు

ఆటంకాలు ఎదురైనా లక్ష్యం సాధించాలి

నర్సాపూర్: విద్యార్థులు పట్టుదలతో చదవాలని, ఆటంకాలు ఎదురైనా లక్షం సాధించాలని విశ్రాంత ఔషధ నియంత్రణ అధికారి మారేపల్లి అమృతరావు అన్నారు. విష్ణు ఫార్మసీ కాలేజీలో శనివారం జరిగిన వార్షికోత్సవానికి ముఖ్య అతిథి హాజరై మాట్లాడారు. వ్యాధులను నయంచేసే టీకాల తయారీలో ఫార్మసిస్టులు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. అనంతరం డాక్టర్ దినేశ్ ఎల్లమెల్లి మాట్లాడుతూ ఇతర రంగాల కన్నా ఫార్మసి రంగం త్వరగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఫార్మా రంగంలో హైదరాబాద్ ముందు వరుసలో ఉందన్నారు. విష్ణు ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ విష్ణురాజు మాట్లాడుతూ తమ కాలేజీల్లో బోధనాలో సుదీర్ఘ అనుభవం ఉన్న అధ్యాపకులన్నారని, ఆధునిక వసతులు, ప్రయోగశాలలున్నాయని వాటిని సద్వినియెగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. వార్షికోత్సవంలో కాలేజీ ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.



కళాశాల వార్షికోత్సవంలో సొసైటీ చైర్మన్ తదితరులు

నేడు సిద్దిపేటకు జనచైతన్య యాత్ర

సిద్దిపేటఅర్బన్: సీపీఎం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న జనచైతన్య యాత్ర ఆదివారం సిద్దిపేట జిల్లాలోకి ప్రవేశించనుందని, 27న సిద్దిపేటలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం సిద్దిపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ విధానాలతో ప్రజలు నానా అవస్థలుపడుతున్నారన్నారు.జనచైతన్య యాత్ర కరీంనగర్ జిల్లా నుంచి సిద్దిపేట జిల్లాలోకి యాత్ర చేరుకోనుందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించే బైక్ ర్యాలీలో పాల్గొనాలని కోరారు. 27న సిద్దిపేటలో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి

కార్మికుల సమస్యలు బీఎంఎస్‌తోనే పరిష్కారం

సదాశివపేట(సంగారెడ్డి): ఎంఆర్ఎఫ్ కార్మికుల వేతన ఒప్పందంతో పాటు కార్మికుల సమస్యల పరిష్కారం బీఎంఎస్‌తోనే సాధ్యమని హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. శనివారం ఎంఆర్ఎఫ్ కార్మికుల సమావేశానికి హాజరై మాట్లాడారు. ఎంఆర్ఎఫ్ కార్మిక యూనియన్ అధ్యక్షుడిగా పోటీ చేస్తున్న మల్లేశంను గెలిపించాలన్నారు. కార్మికులకు మంచి వేతన ఒప్పందం చేయించి వారి సమస్యలను పరిష్కరించడానికి తాము కూడా సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీజేపీ నాయకులు శివరాజ్ పాటిల్, బీఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంమోహన్, బీఎంఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈటల రాజేందర్

తహసీల్దార్ కార్యాలయంలో కలకలం

- ఒంటిపై డీజిల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించిన యువకుడు
- తన తండ్రి పేరిట ఉన్న భూమి కబ్జాచేశారంటూ ఆవేదన

కౌడిపల్లి(నర్సాపూర్): తన తండ్రి పేరిట ఉన్న భూమిని ఇతరులు కబ్జాచేసుకుని పట్టా చేసుకున్నారని, తన పేరిట తిరిగి పట్టా చేయాలంటూ ఓ యువకుడు తహసీల్దార్ కార్యాలయంలో డీజిల్ పోసుకుని ఆత్మహత్యయత్నం చేశాడు. ఇది గమనించిన పలువురు అతడిపై నీళ్లుపోశారు రక్షించారు. ఈ సంఘటన కౌడిపల్లి తహసీల్దార్ కార్యాలయంలో శనివారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కౌడిపల్లి గ్రామానికి చెందిన చిన్నంగారి గొల్ల నాగరాజు తండ్రి గొల్ల దుర్గయ్య పేరిట గ్రామశివారులో జాతీయ రహదారి పక్కన సర్వేనంబర్ 496/2లో ఎకరం 39 గుంటల సాగుభూమి 1996 ఫైనల్ పట్టాచేసి ప్రభుత్వం ఇచ్చింది. కాగా ఇటీవల తండ్రి మృతి చెందడంతో తల్లి లక్ష్మీ పేరిట ఫౌతికోసం వెళ్లగా ఆ భూమి గ్రామానికి చెందిన పోల లావణ్య, పోల పద్మ, పోల జయసుధ పేరిట పట్టా అవడంతో విస్మయం చెందాడు. తాము బతుకుదెరువు కోసం పట్నం వెళ్లగా తమ భూమిని అక్రమంగా కబ్జాచేశారని ఆరోపించారు. సుమారు 15 ఏళ్ల క్రితం కూతురు పెళ్లి కోసం ఓ వ్యక్తి నుంచి రూ.30 వేలకు తనఖాపెట్టాడు. అతడు చనిపోవడంతో తమ భూమి తమపేరిట ఉందనుకున్నామని, ఇతరులు కబ్జా చేసినట్లు తెలియదని వాపోయాడు. తన పేరిట భూమి మార్చాలని అధికారులను కోరినా చేయడంలేదని, దీంతో ఆత్మహత్యకు యత్నించాడు. అధికారులు స్పందించి తనభూమి తమకు ఇవ్వాలని కోరాడు. ఆత్మహత్య విషయం రెవెన్యూ అధికారులు పోలీసులకు చెప్పడంతో ఏఎస్ఐ శ్రీనివాస్ సిబ్బంది వచ్చి స్టేషన్‌కు తీసుకువెళ్లి ఆత్మహత్యకు పాల్పడటం సరికాదని కౌన్సెలింగ్ ఇచ్చారు.



పోలీస్ స్టేషన్‌లో నాగరాజు

తహసీల్దార్ వివరణ

ఈ విషయంపై ఇన్‌చార్జి తహసీల్దార్ తారాబాయ్‌ని వివరణ కోరగా ఈనెల 20వ తేదీన నాగరాజు తనభూమి పట్టాచేయాలని 1996లో ప్రభుత్వం ఇచ్చిన ఫైనల్ పట్టా జిరాక్స్ పత్రాలతో దరఖాస్తు చేశాడన్నారు. 1996లో గొల్ల దుర్గయ్య పేరున పట్టా ఉండగా 2013–14 నుంచి పహాణీలో పోల కంసమ్మ పేరున పట్టా అయిందన్నారు. ధరణిలో సైతం ఆమె పేరిట పాస్‌బుక్కు రాగా సాగులో సైతం చేస్తున్నట్లు చెప్పారు. పోల కంసమ్మ చనిపోవడంతో కుటుంబ సభ్యుల పేరున ఫౌతి అయిందని చెప్పారు. పట్టా ఎలా మార్పు జరిగింది పూర్తి విచారణ జరిపి జిల్లా అధికారులు నివేదిక ఇస్తామన్నారు.